క్లుప్తంగా

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

బీబీపేట : మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే అధిక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఏఎస్సై ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ప్రతి వాహనదారునికి తనిఖీ చేశారు. అంతే కాకుండా పలు ద్విచక్ర వాహనదారులకు ధ్రువపత్రాలు లేని వారికి జరిమానాలు విధించారు. ఆయన వెంట సిబ్బంది రవి, రంజిత్‌లు ఉన్నారు.

కలుషిత నీటి సరఫరాను అరికట్టాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : కలుషిత నీటిని అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. మండలంలోని అంజనిగేట్, పోచారం గేట్ మధ్యలో జాతీయ రహదారి పక్కన మిషన్ భగీరథ నీరు రెండేళ్లుగా లీకేజీ అవుతోంది. మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో పలు గ్రామలకు వెళ్లే మిషన్ భగీరథ నీరు కలుషితమవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని కొమలంచ గ్రామంలో ఆదివారం బాన్సువాడ లెన్స్ కేర్ ఆప్టికల్స్ ఆధ్వర్యంలో నేత్రవైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు కంటి వైద్య నిపుణుడు నాగరాజు పరీక్షలు చేసి, కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రవీగౌడ్, విఠల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బీమా చెక్కు అందజేత



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన నీల రాఘవులు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. మృతుడు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మెదక్ బ్రాంచ్‌లో చేయడంతో ఆయనకు మరణానంతరం మృతుడి నామిని భార్య నీల లక్ష్మికి బీమా కింద రూ. 5,64,750 చెక్కును బ్రాంచ్ డీజీఎం నరేందర్ ఆదివారం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎం విజయ్, మేనేజర్ విమల దేవి పాల్గొన్నారు.

దాతలకు సన్మానం



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం విరాళాలు అందజేసిన దాతలకు ఆదివారం ఆలయ సిబ్బంది సన్మానం చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన పుణుగోటి సంధ్య,అభిషేక్ దంపతులు ఆలయ రాజగోపురం,ప్రదక్షిణ స్థలం, యాగశాల రు4.50లక్షల గ్రానైట్ అందజేసినట్లు సిబ్బంది తెలిపారు. ఈ మేరకు దాతలకు స్వామి వారి శేషవస్త్రాలు అందజేసి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్, అర్చకుడు నరసింహాచార్యులు ఉన్నారు.

ముందస్తు సాగుకు సన్నద్ధం



బాన్సువాడ రూరల్ : మండలంలోని నిజాంసాగర్ ఆయకట్టు కింద బోరుబావులు ఉన్న రైతులు ఈసారి వర్షాకాలం పంట ముందస్తు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే పొలాలను వేసవి దుక్కిదున్ని ఉంచిన రైతులు నారుమడులు సిద్ధం చేస్తున్నారు. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. మండలంలోని కొయ్యగుట్ట, జక్కల్ దాని తండా, ఇబ్రహీంపేట్, పోచారం, రాంపూర్ గ్రామాల రైతులు వర్షాకాలం ముందస్తు పంటల సాగు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

తారురోడ్డుకు మోక్షమెప్పుడో..?

- అధ్వానంగా చందాపూర్-కన్‌కల్ మార్గం
- బీటీ రోడ్డు వేయాలంటున్న ప్రజలు



తాడ్వాయి మండలం చందాపూర్ నుంచి కన్‌కల్‌కు వెళ్లే కంకర రోడ్డు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని చందాపూర్ గ్రామం నుంచి కన్‌కల్ గ్రామం వరకు ఉన్నమెటల్ రోడ్డును తారురోడ్డుగా మార్చాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ రోడ్డును తారురోడ్డుగా మార్చినట్లయితే పలుగ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ విషయమై ఎన్నో సార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలిపినప్పటికి ఫలితం లేకుండా పోయిందని ప్రజలు చెబుతున్నారు. కనీసం కొత్తగావచ్చినా ఈ ప్రభుత్వమన్నా పట్టించుకుని ఈ రోడ్డును బాగుపర్చాలని కోరుతున్నారు. ఈ రోడ్డు తారురోడ్డుగా మార్చినట్లయితే తాడ్వాయి మండల ప్రజలకే కాకుండా సదాశివనగర్, గాంధారి, కామారెడ్డి మండల ప్రలజకు ఎంతో మేలు జరుగుతుంది. చందాపూర్ సంగోజీవాడి, కాలోజీవాడి, బ్రాహ్మణపల్లి గ్రామాల ప్రజలు కన్‌కల్, కరడ్‌పల్లి, దేమికలాన్‌తో పాటు గాంధారి మండల కేంద్రానికి వెళ్లాలంటే వయా తాడ్వాయి, సదాశివనగర్ మీదుగా వెళ్లాల్సి వస్తుంది. కన్‌కల్, కరడ్‌పల్లి, దేమికలాన్ గ్రామస్తులు సదాశివనగర్ వెళ్లాలంటే తాడ్వాయి, కామారెడ్డి మీదుగా వెళ్లాల్సి వస్తుంది. ఇక్కడి ప్రజలు గాంధారిలో ఆదివారం అతిపెద్దగా జరిగే సంతకు తరచుగా వెళ్తుంటారు. ఈ రోడ్డును తారురోడ్డుగా మార్చినట్లయితే కామారెడ్డి డిపోనుంచి నేరుగా కరడ్‌పల్లి, గాంధారి వరకు ఆర్టీసీ బస్సులను నడిపించవచ్చు.

అధికారులు పట్టించుకోవాలి



అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని ఈ రోడ్డును తారురోడ్డుగా మార్చాలి. ఎన్నోసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని మా సమస్యలు తీర్చాలి. – సాయిలు, చందాపూర్

దూరభారం తగ్గుతుంది



చందాపూర్ నుంచి కన్‌కల్ వరకు ఉన్న రోడ్డును తారు రోడ్డుగా మార్చినట్లయితే దూరభారం బాగా తగ్గుతుంది. అలాగే తక్కువ డబ్బులతో ప్రయాణించవచ్చు. కొన్ని సందర్భాల్లో కరడ్‌పల్లి, గాంధారి తదితర గ్రామాల్లో ఉన్న వాళ్ల దగ్గరికి వెళ్లలేకపోతున్నాం.– భూమన్న, చందాపూర్

కొత్త ప్రభుత్వమైనా పట్టించుకోవాలి



కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా పట్టించుకుని ఈ రోడ్డును తారురోడ్డుగా మార్చాలి. ఈ రోడ్డుబాగు పడితే ఇతర గ్రామాలకే కాకుండా వ్యవసాయ పొలం వద్దకు సులువుగా వెళ్లవచ్చు. – రవి, చందాపూర్

ఎండిన చెట్టుతో ప్రమాదం



నస్రుల్లాబాద్ వద్ద ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా మారిన చెట్టు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : నస్రుల్లాబాద్–బాన్సువాడ ప్రధాన జాతీయ రహదారిపై ఎండిన చెట్లు రోడ్డుకు ఇరువైపులా పెరిగాయి. దీనితో అకాల వర్షాలకు, ఈదురు గాలులకు ఎండిన కొమ్మలు పడి ప్రయాణికులకు గాయాలు అవుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎండిన చెట్ల కొమ్మలను తొలగించి ప్రయాణికులకు సహకరించాలంటున్నారు. విద్యుత్ వైర్ల కింద ఉన్న పచ్చని చెట్లను కూడా తొలగిస్తున్న అధికారులు ఇలా ఎండిన చెట్లను కొట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

చెరువు మట్టి చేనుకు బలం



మద్నూర్‌లో చేనులో వేసుకున్న నల్ల మట్టి

మద్నూర్(జుక్కల్) : చెరువులోని నల్ల మట్టి చేనుకు బలాన్ని అందిస్తుందని వ్యవసాయ అధికారులు సూచించడంతో రైతులు చేలల్లో నల్లమట్టిని వేసుకుంటున్నారు. ప్రస్తుతం వేసవికాలం సందర్భంగా చేలల్లో పంటలు లేకపోవడంతో రైతులు చెరువుల్లోని నల్లమట్టిని వ్యవసాయ భూముల్లో వేసుకుంటున్నారు. ట్రాక్టర్లకు అద్దెకు మాట్లాడుకొని రైతులు నల్లమట్టిని చేన్లకు తరలిస్తున్నారు. కొందరు సమాంతరంగా లేని చేన్లలో కూడా రైతులు నల్లమట్టిని తరలిస్తున్నారు.

బోరు మోటార్ ప్రారంభం



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని గాలీపూర్ గ్రామ 8 వార్డులో ఆదివారం బోరు మోటార్‌ను కాంగ్రెస్ నాయకుడు హన్మాండ్లు ప్రారంభించారు. సదరు వార్డులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి బోరు వేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బేస్త.శ్రీనివాస్, బాల్‌రెడ్డి, సాకలి రాజయ్య, శంకర్, దశరథ్ ఉన్నారు.

విద్యార్థిని సిరికి అభినందన



కామారెడ్డి అర్బన్ : ఎల్లారెడ్డి కల్యాణిబేస్‌కు చెందిన మంద్రు సిరి ఆర్మూర్ కేజీబీవీలో పదో తరగతిలో 10 జీపీఏ సాధించినందుకు శ్రీలక్ష్మి చేయూత సేవా సమితి ఆదివారం నిర్వహించిన సభలో అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ 10 జీపీఏ సాధించడంపై ఆమెను, ఆమె తల్లిదండ్రులు శ్రీనివాస్, లావణ్యను అభినందించారు.

మూడు సెల్‌ఫోన్లు అప్పగింత



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండలంలోని పలు గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు సెల్‌ఫోన్లు పోగొట్టుకోవడంతో బాధితులకు ఎస్సై మహేశ్ ఆదివారం ఫోన్లను ట్రేస్ చేసి తిరిగి వారికి అప్పగించారు. మండలంలోని నీలకిష్టయ్య, గణపతికుమార్, కుసలకంటి దుర్గయ్య తదితరులు సెల్‌ఫోన్లు పోగొట్టు కోవడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి వాటిని అందజేశారు.

ఎల్ఈడీ లైట్లు అందజేత

బీబీపేట : మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌కు మండల కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఆసిఫ్ ఎల్ఈడీ బల్బులను ఎస్సై ప్రభాకర్‌కు అందజేశారు. పోలీసుస్టేషన్‌లోని ఆవరణలో విద్యుత్ బల్బులు అవసరం ఏర్పడడంతో ఆసిఫ్ అందజేశారని ఆయనకు ఎస్సై కృతజ్ఞతలు తెలియజేశారు. సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు ముందుండాలని ఆసిఫ్ తెలిపారు.

శిథిలావస్థలో అమరుల స్థూపం



బాన్సువాడ రూరల్ : మండలంలోని కొయ్యగుట్ట చౌరస్తాలో ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపానికి పలుచోట్ల టయల్స్ ఊడి పోయాయి. స్థూపం శిథిలావస్థకు చేరి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. కనీసం ఈసారి జూన్ 2న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాల నాటికి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

సమాచారం..

నేడు నాగిరెడ్డిపేటలో కంటి వైద్య శిబిరం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ సిబ్బంది ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆప్తాల్మిక్ వైద్యులు హరికిషన్ రోగులకు ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

దివ్యమానవ నిర్మాణ శిబిరం..

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణ పరిధిలోని పాతరాజంపేట శివారులోని ఆర్షగురుకులంలో ఈనెల 27, 28, 29 తేదీల్లో దివ్యమానవ నిర్మాణ శిబిరం నిర్వహించనున్నట్లు ఆర్షగురుకులం ప్రతినిధి ఆచార్య వేదమిత్ర ఆర్య తెలిపారు. 20ఏళ్ల పైబడిన వయసు ఉన్న వారు దంపతులు గాని, ఒక్కరు గాని శిబిరంలో పాల్గొనవచ్చన్నారు. గురుకులం నిర్వాహకులు బ్రహ్మానంద సరస్వతి వివరిస్తారని ఆచార్య వేదమిత్ర ఆర్య పేర్కొన్నారు. 98488 53383కు సంప్రదించాలన్నారు.

31లోగా ఇంటర్‌లో అడ్మిషన్లు తీసుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ సాయిబాబా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో సీట్ల కోసం పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

నేడు మల్లయోధులకు కుస్తీ పోటీలు

నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని మాగి గ్రామంలో సోమవారం మల్లయోధులకు కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. చివరి కుస్తీ పోటీ విజేతకు 5 తులాల వెండి కడియాన్ని బహుమానంగా అందజేయనున్నట్లు నిర్వాహకుడు చీకోటి మనోజ్ పటేల్ తెలిపారు.

నేడు విత్తనాల పంపిణీ

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండల పరిధిలో రైతులకు కామారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ)లో సబ్సిడీపై జీలుగా, పెద్ద జనుము విత్తనాలను సోమవారం పంపిణీ చేయనున్నట్లు సీఈవో మోహన్ రావు, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ రావులు తెలిపారు.

మూగజీవాలకు కలుషిత నీరే దిక్కా..?



బాన్సువాడ రూరల్ : మూగజీవాల దాహార్తి తీర్చడానికి గ్రామాల్లో నిర్మించిన నీటితొట్టిలు నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. నీటితొట్టిలను నెలల తరబడి శుభ్రం చేయించకపోవడంతో నాచు పేరుకుపోయింది. కలుషిత నీరు తాగిన పశువులు రోగాల బారిన పడ్తున్నాయి. అధికారులు స్పందించి నీటి తొట్టిలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని పాడి రైతులు కోరుతున్నారు.

సంక్షిప్తం

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మాచారెడ్డి : పాల్వంచ మండలం పోతారం గ్రామ బీఆర్ఎస్ కార్యకర్త రాజయ్య తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు ఆదివారం మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తరఫున నాయకులు రు.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాములు, పోచయ్య, శ్రీనివాస్ గౌడ్, రాములు, రామస్వామి, లింగం, స్వామి గౌడ్ తదితరులున్నారు.

ఐటీఐలో అన్ని కోర్సులకు అడ్మిషన్లు ఇవ్వాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు అన్ని కోర్సుల్లో అడ్మిషన్లు కల్పించాలని ఎంఐఎం నాయకులు రజాక్ ఆదివారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. ఎల్లారెడ్డికి ఐటీఐ వచ్చిన సమయంలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, కోపా తదితర కోర్సుల్లో అడ్మిషన్లు ఇవ్వడం జరిగేవని, ప్రస్తుతం కోపాకు మాత్రమే అడ్మిషన్లు ఆన్‌లైన్‌లో ఉండడంతో కళాశాలను ఎత్తివేసే ధోరణి కనిపిస్తోందన్నారు.

29న బాలికల కళాశాలలో..

బాన్సువాడ : ఈనెల 29న దుర్కి గిరిజన సంక్షేమ బాలికల కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ నీలిమాదేవి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పదవ తరగతిలో ఉత్తీర్ణులైన ఎస్టీ బాలికలు అర్హులని అన్నారు. పదో తరగతి మెమో, బోనఫైడ్, ఒరిజినల్ టీసీ, ఆధార్ కార్డు, ఆదాయం సర్టిఫికెట్, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, రెండు జతల జిరాక్సులు తీసుకుని రావాలన్నారు.

సారంగాపూర్ ఆలయానికి పాదయాత్ర



పిట్లం(జుక్కల్): మండలంలోని పోతురెడ్డిపల్లి హనుమాన్ ఆలయం నుంచి నిజామాబాద్ జిల్లాలోని సారంగాపూర్ హనుమాన్ ఆలయంకు ఆదివారం భక్తులు మహాపాదయాత్రగా తరలి వెళ్లారు. ఆలయ నిర్వాహకుడు తేజ స్వామి ఆధ్వర్యంలో భక్తులు రాంపూర్‌కు చేరుకోగా రాంపూర్ మాజీ సర్పంచ్ నారాయణ రెడ్డి వారికి అల్పాహారాన్ని అందజేశారు.

కమనీయం.. వేంకటేశ్వరుడి కల్యాణం



లింగాపూర్‌లో వేంకటేశ్వరస్వామి కల్యాణం



చిన్నమల్లారెడ్డిలో..

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి పట్టణ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి, సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో స్వామి వారికి పట్టు వస్త్రాలు, పుస్తె మట్టెలు అందజేశారు. వేద పండితుడు రవికాంత్‌చారి, ప్రసాద్‌శర్మ, వేణుగోపాల్‌శర్మ, వంశీశర్మ, సోమదత్త శర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కల్యాణం అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారికి పల్లకి సేవతో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొమిరెడ్డి పెద్ద నారాయణ, బండారి యాదవరెడ్డి, తేలు ఆంజనేయులు, బండారి రాజిరెడ్డి పాల్గొన్నారు.

చిన్నమల్లారెడ్డిలో..

మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలో ఆదివారం 14వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ లక్ష్మీప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించి ఆలయంలో స్వామి వార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి పుస్తె మట్టెలు అందజేశారు. ఆలయ అర్చకుడు శ్రీ మేనేపల్లి నర్సింహాచార్యులు, ఆలయ అర్చక సిబ్బంది కార్య నిర్వాహకులు యం పరాంకుశాచార్యులు, అఖిలేష్ ఆధ్వర్యంలో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు.

దుస్థితిలో గ్రంథాలయం

బాన్సువాడ : బీర్కూర్ గ్రంథాలయం శిథిలావస్థకు చేరింది.గ్రంథాలయాని రావాలంటే పుస్తక ప్రియులు, నిరుద్యోగులు భయందోళనకు గురవుతున్నారు. ఏ క్షణంలో ఏవైపున భవనం కూలుతుందోనని ఆందోళన చెందుతున్నారు.ప్రతిరోజు గ్రంథాలయంకు వచ్చే వారు శిథిలావస్థకు చేరిన గ్రంథాలయం భవనం చూసి అటు వైపు రావాలంటే జంకుతున్నారు. అధికారులు స్పందించి గ్రంథాయలంకు నూతన భవనం నిర్మించాలని పాఠకులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన బీర్కూర్ గ్రంథాలయ భవనం

లొంక పెరుమాండ్ల ఆలయంలో పూజలు



సిద్ధరామేశ్వరాలయంలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

భిక్కనూరు:మండలంలోనిసిద్ధరామేశ్వరాలయంలో ఉడిపి వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాస్తు హోమ కార్యక్రమాలు వేద పఠన కార్యక్రమాలు ఆరవ రోజు ఘనంగా నిర్వహించారు.హైకోర్టు న్యాయవాది పెద్ద బచ్చగారి రాంరెడ్డి–కృష్ణకుమారీల సహకారంతో ఆదివారం సిద్ధరామేశ్వరాలయం సమీపంలో ఉన్న లొంకలో వెలిసిన లొంక పెరెమాండ్లు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భిక్కనూరు–రామేశ్వర్‌పల్లి గ్రామ శివారులో ఉన్న పురాతన పెండ్లి పోచమ్మ ఆలయం వద్దనే లొంక పెరుమాండ్లు స్వామి విగ్రహం ఉండేదని కొందరూ పెరుమాండ్లు స్వామి విగ్రహన్ని అక్కడి నుంచి తీసుకెళ్లారని దీంతో తీసుకెళ్లిన వారి కుటుంబాల్లో సమస్యలు తలెత్తడంతో వెంటనే వారు విగ్రహన్ని లొంక వద్ద వదిలివెళ్లారని దీంతో స్వామి వారి అక్కడే స్వయంగా ప్రతిష్ఠించబడ్డారని వివరించారు. తదుపరి సిద్ధరామేశ్వరాలయం ప్రాంగణంలో తిలహోమం భగవద్గీత పఠనం, భాగవత పారాయణం, గోసూక్త హోమం,వాస్తు హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

ఆధ్యాత్మికం

గ్రామ దేవతలకు బోనాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆదివారం గ్రామ దేవతలకు బోనాలు ఊరేగించారు. ఈ సందర్భంగా మత్తడి పోచమ్మ, ముత్యాల పోచమ్మకు గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతీ ఇంటికి బోనం తీసుకొని గ్రామంలోని ప్రధాన వీధుల్లో డప్పువాయిద్యాలు, పోతరాజు విన్యాసాలతో వైభంగా బోనాలు ఊరేగించారు. మొక్కులు తీర్చుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పెద్దలు, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



నిజాంసాగర్(జుక్కల్) : గ్రామ దేవతల పండుగల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని బ్రాహ్మణపల్లి, మాగి గ్రామాల్లో బోనాల ఊరేగింపు జరిపారు. ఆయా గ్రామాల్లో ఉన్న గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు, మేకలు, కోళ్లతో మొక్కులు చెల్లించారు. ఆనంతరం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఇంటింటికో బోనం చొప్పున ఆడపడుచులు ఊరేగింపు, ర్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మహంకాళి అమ్మవారి బోనాల పండుగ



పిట్లం(జుక్కల్) : మండలంలోని ధర్మారం గ్రామంలో మహంకాళి అమ్మవారి బోనాల పండుగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు బోనాలతో ఊరేగింపుగా గ్రామశివారులోని మహంకాళి అమ్మవారి ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించారు.

తాడ్వాయిలో..



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండల కేంద్రంలో ఆదివారం గ్రామస్తులు బోనాల పండుగను నిర్వహించారు. మహిళలు తమ ఇండ్లలో అందంగా బోనాలను అలంకరించారు. అనంతరంగా డప్పువాయిద్యాలతో బోనాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ శివారులో ఉన్న గ్రామ దేవతలకు బోనాలను సమర్పించారు. ఈ వేడాది వర్షలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని గ్రామదేవతలను కోరుకున్నారు.